క్లుప్తంగా

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

మున్సిపల్ చైర్మన్ కొండూటి నరేందర్



అన్నదాన కార్యక్రమంలో చైర్మన్ నరేందర్, కమిషనర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొండూటి నరేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కొండూటి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే ఏకాగ్రత పెరుగుతుందన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. అన్నదానం మహాదానం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, వీహెచ్‌పీ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు



మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని చేవెళ్ల మండలంలోని పామెన గ్రామ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో పామెనకు చెందిన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఎర్ర గోపాల్, యూత్ ప్రధాన కార్యదర్శి డి.కరుణాకర్‌రెడ్డి, పార్టీ పామెన యూత్ అధ్యక్షుడు బక్క అనిల్‌కుమార్‌లు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల నాయకులు

షాబాద్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథ కం మహిళలకు వరం లాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నా రు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఖాజా మీయా, రవీందర్‌నాయక్, ఆంజనేయులు, మునగపాటి నర్సింహులు, నాయకులు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న నాయకులు

షాబాద్: రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై సమావేశంలో చర్చించామన్నారు ఒక మహిళా రైతుకు ఎస్‌బీఐ బ్యాంకులో సాంకేతిక కారణాలతో బ్యాంకు లోన్ ఆగిపోయిందని, సమస్య తమ దృష్టికి రావడంతో బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ సమస్యలు కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి దోనూరి కృష్ణ, చంద్రయ్యగౌడ్, నర్సింహారెడ్డి,ఒగ్గు మల్లేశ్, బూర్గుల కృష్ణ, షాబాద్ వీరేశం,రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి నోచుకోని గ్రంథాలయ భవనం



అద్దె షెటర్లో కొనసాగుతున్న గ్రంథాలయం

విజ్ఞాన భవనాన్ని ప్రారంభించేదెప్పుడో?

- అసౌకర్యాల మధ్య గ్రంథాలయ నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: అన్ని ఉన్న అల్లుని నోట్లో శకుని అన్న చందంగా మారింది కొత్తూరు గ్రంథాలయం పరిస్థితి. గత భవనంలో పలు సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులుపడ్డారు. కాగా పాఠకులకు అన్ని సౌకర్యాలు, వసతులతో కూడిన నూతన భవన నిర్మాణ పనులు గత రెండేళ్లుగా కొనసాగుతున్నా పూర్తికాలేదు. దీంతో తాత్కాలికంగా అద్దె షెటర్లో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో నూతన భవన నిర్మాణ పనులు చివరిదశలో నిలిచిపోయాయి.

తగ్గిన పాఠకుల సంఖ్య..

పట్టణంలో ప్రస్తుతం అద్దె షెటర్లో గ్రంథాలయం అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. గతంలో గ్రంథాలయానికి 150 మంది వరకు పాఠకులు వస్తుండగా స్థలాభావం కారణంగా ప్రస్తుతం కేవలం 25 మంది పాఠకులు మాత్రమే వస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయంలో నిత్యం 14 దినపత్రికలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన 700 పుస్తకాలు, ఇతర మ్యాగ్జిన్లు పాఠకుల కోసం ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

గత రెండేళ్ల క్రితం సుమారు రూ.75 లక్షలతో కాంట్రాక్టర్ కొత్తూరు పట్టణంలో నూతన గ్రంథాయల భవన నిర్మాణ పనులు ప్రారంభించాడు. కాగా నిధులు సరిపోకపోవడంతో ఆ శాఖ అధికారుల అనుమతితో రూ.10 లక్షలు అదనంగా వెచ్చించి పనులు చేపట్టాడు. ప్రస్తుతం పనులు చివరిదశలో ఉండగా.. అధికారుల నుంచి కాంట్రాక్టర్ చేపట్టిన అదనపు పనుల బిల్లులు రూ.10లక్షలు మంజూరు కావడంలేదు. దీంతో కాంట్రాక్టర్ గ్రంథాలయ భవనానికి తాళం వేశాడు. విషయం తెలిసినా గత ఏడు నెలల నుంచి అటు పాలకులు ఇటు అధికారులు కాంట్రాక్టర్ బిల్లుల విషయం తేల్చడంలేదు. దీంతో అద్దె షెటర్లో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో పాఠకులు అసౌకర్యాల మధ్య ఇబ్బందులు పడుతున్నారు.

పాఠకుల సంఖ్య తగ్గుతుంది

ప్రస్తుతం పట్టణంలో అద్దె షెటర్లో గ్రంథాలయం కొనసాగుతోంది. అక్కడ స్థలాభావం కారణంగా పాఠకుల సంఖ్య తగ్గుతోంది. గతంలో 150 నుంచి 200 వరకు ప్రతిరోజు పాఠకులు వస్తుండగా, ప్రస్తుతం 25 నుంచి 30 మంది పాఠకులే వస్తున్నారు.

– శ్రీనివాస్‌రాజు, కొత్తూరు, లైబ్రేరియన్

బిల్లుల కోసమే తాళం వేశాడు

కొత్తూరు పట్టణంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.75లక్షలు మంజూరయ్యాయి. కాగా చివరి దశలో నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్ అదనంగా డబ్బులు వెచ్చించి పనులు చేపట్టాడు. బిల్లులు ఇవ్వని కారణంగానే భవనానికి తాళం వేశాడు.

– విక్రమ్, ఏఈ, ఈడబ్ల్యూఐడీసీ

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నందిగామ:అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ గ్రామాల్లో బీజేపీ మండల సభ్యత్వ నమోదు ప్రముఖ్ చేగు సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ బూత్‌లో కనీసం 200 సభ్యత్వాలు ఉండే విధంగా కష్టపడాలని సూచించారు. బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసినట్లయితే మండల, జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిలో పార్టీ బలంగా ఉంటుందని చెప్పారు. కార్యాక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, సురేందర్, కృష్ణమోహన్, అరవింద్, వెంకటేశ్, నర్సింహ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



స్వేరోకు ప్రొజెక్టర్ అందిస్తున్న సొసైటీ సభ్యులు

కేశంపేట: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని అంబేడ్కర్ పే బ్యాక్ సొసైటీ సభ్యులు విక్రాంత్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో ఉన్న స్వేరో సర్కిల్‌కు సోమవారం అంబేడ్కర్ పే బ్యాక్ సొసైటీ సభ్యులు విక్రాంత్, అమృత్, సంతోష్‌లు విద్యార్థులకు డిజిటల్ బోధనలు చేసేందుకు ప్రొజెక్టర్, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు డిజిటల్ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దాతల సహకారంతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు కోరారు. చదువుతోనే ఉపాధి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజసేవ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైలారం జగన్, జిల్లా అధ్యక్షుడు శివ కుమార్, కోశాధికారి మల్లేశ్, కాకునూర్ గ్రామ కమాండర్లు మల్లేశ్, రమేశ్‌లు, స్వేరో పంది లింగం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- జీపీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు జంగయ్య



ధర్నాకు తరలివెళ్తున్న కార్మికులు

షాద్‌నగర్: జీపీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య డిమాండ్‌చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్‌కు తరలివెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. తెల్లవారింది మొదలు గ్రామాల పరిశుభ్రతకు కార్మికులు ఎంతో శ్రమిస్తుంటారన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మూడునెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రయ్య, బాలమణి, నర్సమ్మ, పుష్పమ్మ, మైసయ్య, నర్సింలు, జంగయ్య, పద్మమ్మ, లక్ష్మమ్మ, జంగమ్మ, నర్సింహ, యాదమ్మ, మంజుల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక



మండల ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ శ్రీలత హాజరయ్యారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 465 పనులకు సంబంధించిన ఖర్చుల వివరాలు, ఈ పనుల నిర్వహణలో జరిగిన అవకతవకలను వెలికితీయడానికి సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్పీలు వెంకన్న, యాదగిరిగౌడ్‌లతో పాటు 12 మంది డీఆర్పీలు సెప్టెంబర్ 26 నుంచి గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. అదే విధంగా గ్రామాలకు సంబంధించిన వివరాలను ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వెల్లడించారు. కాగా సోమవారం మండల ప్రజావేదిక నిర్వహించి ఎస్‌ఆర్పీలు వివరాలను వెల్లడించారు. అయితే ఉదయం ప్రారంభం కావాల్సిన ప్రజావేదిక కార్యక్రమం జిల్లా అధికారులు ఆలస్యంగా హాజరుకావడంతో సాయంత్రం 3 గంటలకు ప్రజావేదిక ప్రారంభమైంది. రాత్రి వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందని వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ శరణ్‌గౌతమ్,అంబుడ్స్‌మెన్ సునిత, క్వాలిటీ కంట్రోల్ అధికారి సుబ్బారావు, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఏపీఓ నర్సింగ్‌రావుతో టీఏలు, ఎఫ్‌ఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నక్షబాట కబ్జాపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: నక్షబాటను కొందరు కబ్జాచేయడంతో తమకు బాట లేకుండాపోయిందని, కబ్జాకు గురైన నక్షబాటను విడిపించాలని కోరుతూ అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ రాజేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 153లో గత యాభై ఏళ్ల క్రితం ప్రభుత్వం లావుని పట్టాలు ఇచ్చిందని, నాటి నుంచి నేటివరకు ఆ భూమిని సాగుచేసుకొని జీవిస్తున్నామని పేర్కొన్నారు. మా భూముల్లోకి వెళ్లేందుకు ఉన్న నక్షబాటను గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జాచేశారని, దీంతో తాము రాకపోకలు కొనసాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూముల్లోకి వెళ్లాలంటే నందిగామ మీదుగా సుమారు 7 కి.మీ దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయమై గతంలో అధికారులకు రెండుసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి నక్షబాటను విడిపించాలని వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రాజు, నాగుల బుచ్చయ్య, లక్ష్మమ్మ, నర్సింలు, శివుడు, రవి, చంద్రయ్య, బాలయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో వస్తున్న మహిళలు

శంకర్‌పల్లి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిల్లిగుండ్ల గ్రామ శివారులో వనిత చేయూత మహిళా విభాగం సౌజన్యంతో టీడీఎఫ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ స్పోక్స్ పర్సన్ భవానీరెడ్డి హాజరయ్యారు. మోకిల, పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటలు, దాండియా, నృత్యాలతో అలరించారు. అందమైన బతుకమ్మలను తయారు చేసిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వందకుపైగా దేశాల్లో బతుకమ్మ సంబురాలను నిర్వహించడం గర్వకారణమన్నారు. నిజామాబాద్ జానపద బృందం వారితో ఆలపించిన పాటలు అందరినీ ఉత్సాహపరిచాయి.కార్యక్రమంలో వాణితిమ్మయ్య, వేణుగోపాల్‌రెడ్డి, శారద శారీస్, సుభిషి, విజేత సూపర్‌మార్కెట్, నిఖిల కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలప్‌మెంట్, ప్రాజన క్రియేషన్స్, రుచికరం, క్రిస్టల్ స్టింగ్స్ తదితరులు బహుమతులు స్పాన్సర్ చేశారు.



షాబాద్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న సీఐ కాంతారెడ్డి, నాయకులు



కొందుర్గు: పెద్దఎల్కిచర్లలో యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్తులు

కనుల పండువగా శరన్నవరాత్రోత్సవాలు

- మహాచండీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

షాబాద్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలు వైభవంగా జరుపుకోవాలని సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో దుర్గామాతకు కాంగ్రెస్ నాయకుడు దండు రాహుల్‌గుప్తా, సీఐ ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అదేవిధంగా మండల పరిధిలోని హైతాబాద్, కుమ్మరిగూడ, తాళ్లపల్లి, మల్లారెడ్డిగూడ, సర్దార్‌నగర్, మన్‌మర్రి తదితర గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. మహాచండీదేవిగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొయినాబాద్: దేవీనవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన అమ్మవారు సోమవారం మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మండల పరిధిలోని సురంగల్, మొయినాబాద్, మేడిపల్లి, పెద్దమంగళారం, చిలుకూరు, రెడ్డిపల్లి, శ్రీరాంనగర్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చేవెళ్ల: మండలంలో దేవినవరాత్రోత్సవాలుఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు మహాచండీ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యజ్ఞ, యాగాలతో వాతావరణ సమతుల్యత

కొందుర్గు: యజ్ఞ, యాగాలతో వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని అర్చకుడు శ్రీనివాసాచార్య అన్నారు. దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో చౌదరిగూడ ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం యజుర్వేద పారాయణ సహిత యజ్ఞం నిర్వహించారు.



మొయినాబాద్: మేడిపల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



చేవెళ్లలో అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

కేశంపేట సీఐగా నరహరి




సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐ

కేశంపేట: కేశంపేట పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా ఎస్‌ఐ విధులు నిర్వహించేవారు. కొత్తగా సీఐని ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా ఎకనామిక్ ఆఫీసెస్ వింగ్ నుంచి నరహరి బదిలీపై వచ్చారు. సోమవారం నూతన సీఐగా నరహరి బాధ్యతలు స్వీకరించారు. సీఐకి ఎస్‌ఐ రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేయించాలి

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లేశ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అధికారులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేయించాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజమల్లేశ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలకు రోడ్లకు మరమ్మతులు చేయించాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానంగా చందానగర్ నుంచి పెద్దమంగళారం, రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం, నక్కలపల్లి నుంచి వెంకటాపూర్ ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ఎ న్కెపల్లి నుంచి బాకారం, బాకారం నుంచి నాగిరెడ్డిగూడ, బాకారం నుంచి అమ్డాపూర్ ఈ గ్రామాల రో డ్లు అడుగడుగునా గుంతలుపడి అధ్వానంగా ఉన్నాయని, అధికారులు మాత్రం కార్యాలయాలకే నిమిత్తమవుతున్నారని గ్రామాలను సందర్శించడం లేద ని పేర్కొన్నారు.రోడ్ల అభివృద్ధిలో అధికారులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు. కార్యక్రమంలో జగన్, మధుమో హన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వడ్డెకుమార్, సాయిచందర్‌చారి, నిఖిల్, శ్రీకాంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం ప్రతినిధులు

రైతులకు కంది విత్తనాల పంపిణీ

షాబాద్: షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేసినట్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక ద్వారా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుసుమ పంటలో అంతర పంటగా కందిసాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. సస్యరక్షణ పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా ఆదాయం పెంపు వంటి విషయాలు వివరించారు. కార్యక్రమంలో రైతులు పీసరి మాధవరెడ్డి, యాదయ్య, బాల్‌రాజు, మహేశ్, సురేశ్, మహేందర్, చంద్రకాంత్, తదితరులు ఉన్నారు.